క్లుప్తంగా

పౌష్టికాహారం తీసుకోవాలి



టీబీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు

సి.బెళగల్: టీబీ రోగులు ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ సునీత సూచించారు. శనివారం 17 మంది టీబీ రోగులకు పవర్‌గ్రిడ్ వారు సరఫరా చేసిన ఉచిత న్యూట్రిషన్ కిట్లను టీబీ సూపర్‌వైజర్లు వేణుగోపాల్ ఆచారి, మహేంద్రలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె.. టీబీ రోగులకు ఆరోగ్య భద్రత, ఆహార నియమాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్ ప్రసాద్ రెడ్డి, వైద్యాధికారులు ఉన్నారు.

ఉపాధిహామీ కూలీలను పెంచండి



సమీక్ష నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు

సి.బెళగల్: ఉపాధిహామీ కూలీల సంఖ్యను పెంచాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో ప్రతిరోజు 3 వేల మందికి పనులను కల్పించాలన్నారు. సమావేశంలో ఏపీఓ లక్ష్మన్న, ఈసీ పృధ్వీరాజు, టీఏలు ఉన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్

గడివేముల: మండల పరిధిలోని తిరుపాడు గ్రామానికి చెందిన వీరభద్రమ్మ (45) శనివారం మృతి చెందింది. వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా మృతురాలి కుమారుడు కృష్ణ ప్రసాద్‌కు రూ.10 వేలను సర్పంచ్ బాలలింగమ్మ అందజేశారు. మిగతా బీమా సొమ్ము త్వరలో బాధితుడి బ్యాంక్ ఖాతాలో జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మాబాషా, వెల్ఫేర్ అసిస్టెంట్ విజయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో క్షయవ్యాధి నివారణ



క్షయవ్యాధి రోగులకు పౌష్టికాహార కిట్లను అందజేస్తున్న డాక్టర్

గడివేముల: వైద్యులు చెప్పిన విధంగా జాగ్రత్తలు పాటిస్తే క్షయవ్యాధిని నివారించుకోవచ్చని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం డాక్టర్ మొల్లా జబీన్ తెలిపారు. శనివారం పీహెచ్‌సీలో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 31 మంది క్షయవ్యాధి రోగులకు న్యూట్రిషన్ ఫుడ్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శోభారాణి, ఎస్‌టీఎస్ శివుడు, ఫార్మసిస్ట్ రాజ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



ఆలమూరులో పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్

పాణ్యం: మండలంలోని పోలింగ్ బూత్‌లను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్ ఆధ్వర్యంలో శనివారం ప్రతి గ్రామంలో ప్రతి పోలింగ్ బూత్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేయనున్న మౌలిక వసతులను పరిశీలించామన్నారు. నివేదిక ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, ఆర్ఐ మహేశ్వరరెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

పాణ్యం: మండలంలోని పలు రెసిడెన్సియల్ పాఠశాలలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు స్థానిక గ్రంథాలయ అధికారిని భాగ్యలక్ష్మి తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ఎస్టీ బాలికల పాఠశాల, ఏపీ మోడల్ స్కూళ్లలో పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. విజేతలకు ఉత్సాల ముగింపు రోజున బహుమతులు అందజేస్తామన్నారు.

.. ఆ సొసైటీ అక్రమాల పుట్ట!

- ది కర్నూలు అర్బన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో రూ.కోటి వరకు నిధులు పక్కదారి
- బాధ్యులను తేల్చలేని సహకార ఆడిట్ అధికారులు
- సెక్షన్–51 కింద విచారణకు ఆదేశాలు

పుష్కర కాలం క్రితం ఆవిర్భవించిన ది కర్నూలు అర్బన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ పుట్టెడు అక్రమాల్లో మునిగితేలుతోంది. సహకార రంగంలో ఏర్పాటైన ఈ సొసైటీలో అక్రమాలు రాజ్యమేలుతున్నాయి. తవ్వే కొద్ది అక్రమాలు బయట పడుతుండటంతో సహకార అధికారులే ఉక్కిరిబిక్కిరవుతున్నారు. – కర్నూలు(అగ్రికల్చర్)

కర్నూలు నగరంలో 2005 వరకు కర్నూలు అర్బన్ బ్యాంకు ఒక వెలుగు వెలిగింది. అయితే అవినీతి, అక్రమాల వల్ల నష్టాల్లో కూరుకుపోవడంతో అర్బన్ బ్యాంకు మూత పడింది. దీని స్థానంలో అర్బన్ బ్యాంకు భవనంలోనే 2010 ప్రాంతంలో ది కర్నూలు అర్బన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఏర్పాటైంది. అప్పటి నుంచి నేటి వరకు మాజీ కార్పొరేటర్ బాలరాజు పాలకమండలి చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. సహకార చట్టం ప్రకారం చైర్మన్‌కు, సీఈఓకు జాయింట్ చెక్ పవర్ ఉండాలి. ఇక్కడ నాన్ అఫీషియల్ పాలకమండలి చైర్మన్ బాలరాజు ఒక్కరికే చెక్ పవర్ ఉన్నట్లు తెలుస్తోంది. సహకార శాఖ ఆడిటర్లు నిర్వహించిన ఆడిట్ ప్రకారం, వివిధ వర్గాల వారి నుంచి అందిన ఫిర్యాదుల మేరకు సొసైటీలో దాదాపు రూ.కోటి వరకు నిధులు పక్కదారి పట్టినట్లు తెలుస్తోంది. అక్రమాలు మరింత ఎక్కువగానే ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సొసైటీకి జిల్లా సహకార కేంద్రబ్యాంకు, తమిళనాడు మార్కెంటైల్ బ్యాంకుల్లో కరంట్ ఖాతాలున్నాయి. మూడు క్యాష్ బుక్‌లు నిర్వహిస్తున్నారు.



కర్నూలు అర్బన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ

గడువు తీరినా చెల్లింపులు లేవు...

కర్నూలు అర్బన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ వ్యాపారాన్ని పెంచుకునేందుకు ఒకవైపు డిపాజిట్‌లు సేకరిస్తోంది. డిపాజిట్‌లు రూ.2 కోట్లకు పైగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. మరోవైపు 100 రోజుల కాలపరిమితితో డైలీ డిపాజిట్‌లు కూడా సేకరిస్తోంది. డైలీడిపాజిట్‌ల వసూలుకు సొసైటీ సీఈఓగా వ్యవహరించే వ్యక్తి కుమారుడే ఏజెంటుగా వ్యవహరించే వారు. ఏడాది క్రితం అనారోగ్య కారణాల వల్ల డైలీ డిపాజిట్ ఏజెంట్ నుంచి వైదొలగడంతో ఆయన తండ్రీ, సొసైటీ సీఈఓనే వసూలు చేశారు. గడువు పూర్తయినప్పటికీ డిపాజిట్‌లు వెనక్కి ఇవ్వడం లేదు. డైలీ డిపాజిట్‌లతో పాటు ఫిక్స్‌డ్ డిపాజిట్‌ల కాలపరిమితి పూర్తయినప్పటికీ ఇవ్వక పోవడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తవుతోంది. బాధితుల ఫిర్యాదు మేరకు స్థానిక 1వ పట్టణ పోలీసులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం. డైలీ డిపాజిట్‌లు సేకరించే వ్యక్తి మాత్రం తాను ప్రతి రూపాయి సొసైటీలో చెల్లించి రసీదులు తీసుకున్నానని చెబుతున్నారు. మరికొందరు మాత్రం నకిలీ కార్డులపై డిపాజిట్‌లు వసూలు చేశారని చెబుతుండటం గమనార్హం. ఈ వ్యక్తినే నేటికీ సీఈఓగా కొనసాగిస్తుండటం మరో విచిత్రం. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, డైలీ డిపాజిట్‌లు ఏమయ్యాయో తెలియని పరిస్థితి. ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు కొంతమంది అరకొరగా చెల్లించి తిప్పుకుంటున్నట్లు ఫిర్యాదులున్నాయి.

భారీగా బయటపడిన అక్రమాలు

ఏటా సహకార శాఖ ఆడిటర్లు సొసైటీ లావాదేవీలపై ఆడిట్ చేస్తారు. 2020–21 నుంచి సొసైటీలో అక్రమాలు జరుగుతున్నట్లు ఆడిట్‌లో వెల్లడైంది. 2021–22లో నిర్వహించిన లావాదేవీలపై ఆడిట్ నిర్వహించగా రూ.40 లక్షలకుపైగా నిధులు పక్కదారిపట్టినట్లు తెలుస్తోంది. 2022–23లో జరిగిన లావాదేవీలపై సహకార శాఖ ఆడిటర్లు ఆడిట్ నిర్వహిస్తున్నారు. ప్రాథమిక సమాచారం మేరకు నిధుల దుర్వినియోగం భారీగానే ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు సహకార శాఖ జిల్లా అధికారికి సొసైటీ అక్రమాలపై ఫిర్యాదులు రావడంతో సబ్ డివిజన్ అధికారి నాగరమణయ్య బృందంతో విచారణకు ఆదేశించారు. కొద్ది రోజులుగా విచారణ జరుగుతున్నా నిధుల దుర్వినియోగం ఏ స్థాయిలో జరిగింది, బాధ్యులెవరనేదానిపై స్పష్టత రాలేదు. సబ్ డివిజినల్ సహకార అధికారి కోరిన మేరకు సహకారం చట్టం సెక్షన్ 51 కింద విచారణ చేయాలని సహకార ఆడిట్ అధికారి శిరీషను డీసీఓ రామాంజనేయులు ఆదేశించారు. అలాగే విచారణ పారదర్శకంగా సాగేందుకు నాన్ అఫీషియల్ పాలక వర్గాన్ని రద్దు చేసి, ఆ స్థానంలో అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు.

అక్రమాలపై విచారణ జరిపిస్తాం

ది కర్నూలు అర్బన్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో ఆడిట్‌లో అక్రమాలు వెలుగు చూశాయి. డైలీ డిపాజిట్‌ల కాలపరిమితి తీరినప్పటికి తిరిగి చెల్లించలేదు. సొసైటీలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించాలని ఫిర్యాదులు అందాయి. సబ్ డివిజినల్ అధికారులతో విచారణ జరిపించాం. అక్రమాల గుట్టు తేలకపోవడంతో సెక్షన్–51 కింద విచారణ జరపాలని ఆదేశించాం.

– ఎస్.రామాంజనేయులు, డీసీఓ, కర్నూలు

రుణాలను జీవనోపాధులుగా మలచుకోవాలి

సి.బెళగల్: పొదుపు మహిళలు బ్యాంక్‌ల ద్వారా పొందే రుణాలను జీవనోపాధులుగా మలచుకోవాలని మండల వైకేపీ ఏపీఎం వెంకటస్వామి సూచించారు. శనివారం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో ఎంఎంఎస్ అధ్యక్షురాలు సృజన పొదుపు మహిళలతో సమావేశం నిర్వహించారు. ముందుగా గత నెలలో గుండెపోటుతో మృతి చెందిన సీసీ నాగేంద్రకు ఎంఎంఎస్ సభ్యులు, వైకేపీ అధికారులు మౌనం పాటించి, సీసీ మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ ప్రతి నెల సమావేశాలను నిర్వహించుకుని, సభ్యుల అవసరాలు, అంతర్గత రుణాల కేటాయింపు, రుణ సహాయాల పెంపు, రుణాల రీ షెడ్యూల్ అంశాలపై చర్చించాలన్నారు.



మాట్లాడుతున్న వైకేపీ ఏపీఎం వెంకటస్వామి

దిశ చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

కోడుమూరు రూరల్: దిశ చట్టంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. శనివారం మండలంలోని అమడగుంట్ల హైస్కూల్‌లో జరిగిన గ్రంథాలయ వారోత్సవాల్లో సర్పంచు వరలక్ష్మితో పాటు, ఎస్‌ఐ శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, యువతులపై జరిగే దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం దిశ చట్టాన్ని అమలు చేస్తోందన్నారు. విద్యార్థినులు తమ ఫోన్లలో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనంతయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

పక్కా ప్రణాళికతో పంచాయతీల అభివృద్ధి

- డీపీఓ టి.నాగరాజునాయుడు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని గ్రామ పంచాయతీలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయ సమావేశ భవనంలో జిల్లాలోని డీఎల్‌పీఓ, ఈఓఆర్‌డీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ గతంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి గ్రామ పంచాయతీ సమావేశాలు జరిగేవని, ప్రస్తుతం ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెంబర్: 227 ప్రకారం ప్రతి నెలా సమావేశాలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఏటా జనవరి 2, ఏప్రిల్ 14, జూన్ 1, అక్టోబర్ 2న గ్రామ సభలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఈ సభలు, సమావేశాలు నిర్వహించేందుకు సర్పంచులు సహకరించకపోతే సంబంధిత పంచాయతీ కార్యదర్శులు ఈఓఆర్‌డీ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఏడాదికి రూ.21 లక్షలకు మంచి ఆదాయం ఉన్న గ్రామ పంచాయతీలను డీపీఓ తనిఖీ చేయాల్సి ఉంటుందని, డివిజన్‌లోని అన్ని పంచాయతీలకు డీఎల్‌పీఓలు, మండలంలోని పంచాయతీలను ఈఓఆర్‌డీలు జాబ్‌చార్ట్ ప్రకారం విజిట్ చేయాల్సి ఉందన్నారు. గ్రామ పంచాయతీల్లోని రికార్డులను కార్యదర్శులు పక్కాగా నిర్వహించాలన్నారు. సమావేశంలో కర్నూలు, ఆదోని డీఎల్‌పీఓలు తిమ్మక్క, శ్రీనివాసులు, నూర్జహాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీపీఓ టీ నాగరాజునాయుడు

మాతృ మరణాలను అరికట్టాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులను గుర్తించి వారికి సరైన సమయంలో వైద్యసేవలు అందించి మాతృ మరణాలు అరికట్టాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య సూచించారు. శనివారం ప్రాంతీయ శిక్షణా కేంద్రం(ఫిమేల్)లో పెద్దతుంబళం, నందవరం పీహెచ్‌సీ పరిధిలో అక్టోబర్‌లో జరిగిన మాతృమరణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రతి నెలా 9న జరిగే ప్రధాన మంత్రి మాతృవందన యోజన కార్యక్రమం ప్రతి ఆరోగ్య కేంద్రంలో నిర్వహించాలన్నారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మాధవి, డీఐఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్, గైనకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అవసరం

కల్లూరు: పాలిటెక్నిక్ విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అవసరమని కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలల కరస్పాండెంట్ ఎస్.విజయలక్ష్మమ్మ అన్నారు. శనివారం దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి పాలిటెక్నిక్ కళాశాలలో చెన్నైకు చెందిన టీవీఎస్ సుందరం ఫాస్టనర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ, రాగటెక్ సోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు ప్రాంగణ ఎంపికలు నిర్వహించాయి. విద్యార్థులకు గ్రూప్ డిస్కషన్, రాత పరీక్ష నిర్వహించారు. మొత్తం 96 మంది విద్యార్థులు పాల్గొనగా 53 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వారిని కరస్పాండెంట్ అభినందించారు. కార్యక్రమంలో ఆయా కంపెనీల డైరెక్టర్లు సురేష్, సుధీర్, ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమార్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కన్న కుమార్ పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి

కర్నూలు(హాస్పిటల్): ఐదేళ్లలోపు చిన్నారులకు క్రమం తప్పకుండా టీకాలు ఇవ్వాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ సూచించారు. శనివారం ఆయన స్టాంటన్‌పురం అంగన్‌వాడీ సెంటర్‌లో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మెడికల్ ఆఫీసర్ టీకాల కార్యక్రమానికి ముందు పీహెచ్‌సీ పరిధిలో ఉన్న సచివాలయానికి సెషన్ షెడ్యూల్ వేస్తారని, తర్వాత రోజు ఏఎన్‌ఎంలు టీకాల కార్యక్రమాన్ని మొదలు పెట్టి పిల్లలకు, గర్భిణులకు టీకాలు వేయించి ఆ వివరాలు నమోదు చేయాలన్నారు. అనంతరం గర్భిణులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలకు ఐఎఫ్ఏ, విటమిన్–ఎ సిరప్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధవి, డీ సీఎం ప్రసాద్, ఏఎన్‌ఎం, ఆశాలు పాల్గొన్నారు.



మాత్రలు అందజేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

అవి-ఇవి

వలంటరీ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

కోడుమూరు రూరల్: మండలంలోని అమడగుంట్ల గ్రామంలో ఖాళీగా ఉన్న వలంటరీ (బీసీ–ఈ జనరల్) పోస్టుకు ఈనెల 20వ తేదీలోగా అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ శనివారం తెలిపారు. దరఖాస్తులను ఈనెల 21 పరిశీలించి 23న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు పకడ్బందీగా నమోదు చేయండి

సి.బెళగల్: పాఠశాలల అభివృద్ధి ప్రణాళికలను హెచ్‌ఎంలు, టీచర్లు పకడ్బందీగా నమోదు చేయాలని ఎంఈఓలు జ్యోతి, ఆదామ్‌బాషా సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓలు అభివృద్ధి ప్రణాళికల నమోదుపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 20న గ్రామ సభలు నిర్వహించి, 21, 22 తేదీలలో క్లస్టర్ పాఠశాలల సమావేశాలు నిర్వహించి 28వ తేదీలోగా నివేదికలు తయారు చేసి ఎమ్మార్సీలో అందజేయాలని హెచ్‌ఎంలకు సూచించారు.

మహా ధర్నాను జయప్రదం చేయండి

పాణ్యం: ఈనెల 27, 28వ తేదీలలో విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టే మహాధర్నాకు అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలన్నారు.

గనిలో నాలుగు ఇళ్లలో చోరీ

గడివేముల: మండల పరిధిలోని గని గ్రామ ఎస్సీ కాలనీలో శుక్రవారం రాత్రి నాలుగు ఇళ్లలో చోరీ చేశారు. గ్రామానికి చెందిన వన్నెంపల్లె సామేలు, కుమారి, మూలింటి చెన్నయ్య, ఉశేని తమ ఇళ్ల తాళాలను గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి బీరువాలలోని విలువైన వస్తువులతో ఉడాయించారు. సామేలు ఇంట్లో అరతులం బంగారు ఉంగరం, పట్టీలు, కమ్మలు, రూ.4 వేలు, కుమారి ఇంట్లో రూ.3 వేలు చోరీకి గురైనట్లు బాధితులు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గూడూరు రూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అబ్దుల్లా(35) దుర్మరణం చెందాడు. అబ్దుల్లా భిక్షాటన చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. గూడూరు కు చెందిన కారు డ్రైవర్ నరసింహులు కె.నాగలాపురంలోని పర్ల రోడ్డులో కారును రివర్స్ చేస్తుండగా వెనుక రోడ్డుపై నిలుచుని ఉన్న అబ్దుల్లాను ఢీ కొట్టా డు. తీవ్రంగా గాయపడిన అబ్దుల్లా కర్నూలు ప్రభు త్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. డ్రైవర్ నరసింహులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సోమ్లానాయక్ తెలిపారు.

కల్లపరి ఆర్‌బీకే తనిఖీ

కోడుమూరు రూరల్: మండల పరిధిలోని కల్లపరి రైతు భరోసా కేంద్రాన్ని ఏఓ రవిప్రకాష్ తనిఖీ శనివారం తనిఖీ చేశారు. అనంతరం అక్కడికి వచ్చిన రైతులతో సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వం కోడుమూరును కరువు మండలంగా ప్రకటించిందని, నష్టపరిహారం కోసం పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, బ్యాంకు అకౌంట్ జిరాక్స్‌లను ఆర్‌బీకేలో సిబ్బందికి ఇవ్వాలని రైతులకు సూచించారు.

ఇంటర్ పరీక్ష ఫీజ్ చెల్లింపు గడువు పెంపు

గూడూరు: ఇంటర్మీడియెట్ ఫెయిల్ అయిన విద్యార్థులకు పరీక్ష ఫీజ్ చెల్లించేందుకు ఈ నెల 30 వరకు ప్రభుత్వం గడువు పొడిగించిందని కళాశాల ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

కల్లూరు: భార్య మృతిని తట్టుకోలేక పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి కోలుకోలేక శనివారం మృతిచెందాడు. ఉలిందకొండ ఎస్‌ఐ నల్లప్ప తెలిపిన వివరాలు.. కర్నూలు ఉద్యోగ నగర్‌లో నివాసముంటున్న వెంకటేశ్వర్‌రెడ్డి (66) తన భార్య 9 నెలల క్రితం క్యాన్సర్ వ్యాధితో మృతిచెందింది. భార్య మరణాన్ని జీర్ణించుకోలేక ఈనెల 14 దూపాడు సమీపంలో పురుగు మందు తాగి కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. వారు అక్కడికి చేరుకుని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక తెల్లవారుజామున మరణించాడు. కుమారుడు శ్రీకాంత్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎస్టీ కమిషన్ చైర్మన పర్యటన జయప్రదం చేయండి

పాణ్యం: రాష్ట్ర ఎస్టీ కమిషన్ చెర్మన్ జి.వి శంకర్‌రావు పర్యటన జయప్రదం చేయాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉసేనయ్య సూచించారు. శనివారం సుగాలిమెట్ట ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసే సభా స్థలిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల సమీపంలోని శిరివెళ్లలో పర్యటన పూర్తి చేసుకుని పాణ్యం మండలంలో పర్యటిస్తున్నట్లు చెప్పారు. పాణ్యంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి, తదనంతరం సుగాలిమెట్టలో పాఠశాల వద్ద గిరిజనులతో ముఖాముఖీ నిర్వహిస్తారన్నారు. గిరిజన సమస్యల పరిష్కారానికి వినతి పత్రాలు స్వీకరిస్తారన్నారు. పర్యటనను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాజునాయక్, రెవెన్యూ, పంచాయితీ అధికారులు, చంద్రనాయక్, తిరుపాల్ పాల్గొన్నారు.

ఏఎన్‌ఎం ట్రైనింగ్ కోర్సు దరఖాస్తుకు గడువు పెంపు

కర్నూలు(అర్బన్): జిల్లాలో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన (ఏ గ్రూపు అయినా) మహిళలకు రెండేళ్ల ఉచిత మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్/ఏఎన్‌ఎం ట్రైనింగ్ కోర్సులో ప్రవేశం పొందేందుకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 30 వరకు గడువు పొడిగించినట్లు ఆదర్శ మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ ట్రైనింగ్ కళాశాల కరస్పాండెంట్ ఈదూరు పద్మాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 9848352725, 7416404740 సంప్రదించాలన్నారు.

ఆదర్శ వనిత ఝాన్సీ లక్ష్మీ బాయి

కర్నూలు కల్చరల్: ఝాన్సీ లక్ష్మీబాయి ఆదర్శ వనిత అని కేంద్రీయ బాల సంస్కార కేంద్రం ప్రముఖ్ సుశ్రీ కిశోరీతాయి అన్నారు. వీహెచ్‌పీ దుర్గా వాహిని మాతృ శక్తి ఆధ్వర్యంలో శనివారం ఝాన్సీ లక్ష్మీ బాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. వినాయక్ ఘాట్‌లోని సత్యనారాయణ స్వామి ఆలయం నుంచి ఓల్డ్‌సిటీలోని వాసవీ కళాశాల వరకు మహిళల భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాలలో జరిగిన సమావేశంలో భరత మాత, ఝాన్సీ లక్ష్మీబాయి చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిశోరీ తాయి మాట్లాడుతూ దేశ వీరోచిత మహిళ ఝాన్సీ లక్ష్మీ బాయిని స్మరించుకోవడం అభినందనీయమన్నారు. ప్రతి మహిళ మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలన్నారు. సనాతన ధర్మం ఆచరించాలన్నారు. అంతకు ముందు ద్విచక్ర వాహన ర్యాలీని వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయి రెడ్డి, జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో రాష్ట్ర సేవికా సమితి అఖిల భారతీయ సంపర్క టోలి సదస్యులు విజయభారతి, వాసవీ మహిళా కళాశాల కరస్పాండెంట్ శశికళ, రాష్ట్ర మాతృశక్తి సంయోజిక గౌరీ, దుర్గా వాహిని సంయోజిక రేఖారాణి, మాతృశక్తి జిల్లా కన్వీనర్ జంపాల రాధిక, దుర్గా వాహిని కన్వీనర్ లక్ష్మి, సింధూర వాణి, పావని, రాధాదేవి, సాయిలత, అశ్విని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిశోరీతాయి

నేడు ఎస్టీ కమిషన్ చైర్మన్ రాక

పాణ్యం: ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి శంకర్‌రావు ఆదివారం పాణ్యం రానున్నారు. మండల పరిధిలోని సుగాలిమెట్ట, పాణ్యం గిరిజన గురుకుల బాలుర పాఠశాలలను ఆయన తనిఖీ చేయనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్ తెలిపారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ



పౌష్టికాహార కిట్లను అందజేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో టీబీ వ్యాధిగ్రస్తులకు శనివారం పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని పురస్కరించుకుని పవర్‌గ్రిడ్‌ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆర్థిక సహకారంతో సీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో 55 మందికి పోషకాలతో కూడిన కిట్లను అందజేశారు.

వ్యాసరచన పోటీలు



వ్యాసరచనలు పోటీలో పాల్గొన్న విద్యార్థులు

గడివేముల: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక మోడల్ పాఠశాల్‌లో 8, 9, 10 వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పోటీతత్వం అలవర్చుకుంటే భవిష్యత్‌లో మంచిస్థాయిలో ఉంటారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మస్తాన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నీటి ట్యాంకు తొలగింపు



నీటి ట్యాంకు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

గూడూరు: పట్టణంలోని సంజీవయ్య నగర్‌లో శిథిలావస్థకు చేరిన నీటి ట్యాంకును శనివారం మున్సిపల్ అధికారులు తొలగించారు. నిత్యం రద్దీ ప్రదేశంలో ట్యాంక్ ప్రమాదకరంగా ఉండటంతో ప్రజలు పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నారు. దీంతో మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, కమిషనర్ ప్రసాద్‌గౌడ్, అధికారులు సిబ్బందితో ట్యాంక్‌ను తొలగించారు.

సామూహిక సత్య నారాయణ వ్రతాలు



సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు

గూడూరు: కార్తీక మాసం సందర్భంగా పట్టణంలోని అంబ భవానీ మాత ఆలయంలో శనివారం ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి వ్రతాన్ని ఆచరించారు.

10న ఉప్పర సంఘం కార్తీక వనభోజనాలు



కరపత్రాలను విడుదల చేస్తున్న ఉప్పర సంఘం నాయకులు

కర్నూలు (న్యూటౌన్): డిసెంబర్ 10న వావిలాల స్కూల్ క్యాంపస్‌లో జిల్లా భగీరథ ఉప్పర సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షులు సత్యన్న తెలిపారు. శనివారం సంఘం కార్యాలయ ఆవరణలో వనభోజనాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక వనభోజనాల సందర్భంగా మహిళలు, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్తీక వనభోజనాలకు జిల్లాలోని ఉప్పరులు హాజరు కావాలని కోరారు.

అవార్డు గ్రహీతకు అభినందనలు



షేక్ అబ్దుల్ గఫార్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు సిటీ: ఏపీ ఉర్దూ అకాడమీ నుంచి ఇటీవల అవార్డు అందుకున్న ఉల్చాల గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ గఫార్‌ను శనివారం కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ తన స్వగ్రహంలో అభినందించారు.

22న వనదేవతల ప్రతిష్ఠోత్సవాలు

గడివేముల: మండల కేంద్రంలోని కొర్రపోలూరు రస్తాలోని కుందూనది ఒడ్డున ఉన్న రాములమ్మ వనంలో గ్రామస్తులు, దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన ఆలయాల ప్రతిష్ఠోత్సవాలు ఈ నెల 22న ప్రారంభమవుతాయని నిర్వాకులు శనివారం తెలిపారు.